ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు



ముత్తారంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు పోస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి రూరల్, జూలై 28 (ఆంధ్ర జ్యోతి) : ఇంటి స్థలం ఉండి ఇళ్లు లేని ప్రతీ పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సోమవారం ముత్తారం, గొరెడ్డిపేట గ్రామాల్లో రూ.90 లక్షల నిధులతో చేపట్టిన మురికి కాలువలు, సీసీ రోడ్లకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసిడింగ్ అందించి ఇళ్లకు ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప, నర్సింహరెడ్డి, మల్లయ్య, రాజేందర్, మహేందర్, శంకరయ్య పాల్గొన్నారు.

అమెరికాలో గుండెపోటుతో సింగరేణిలో ఉద్యోగి...
నీటి బకెట్‌లో పడి చిన్నారి దుర్మరణం 6
చెత్తను రీసైక్లింగ్ చేసి పర్యావరణాన్ని కాపాడాలి 8

అతివల అక్షరాస్యతకు ఉల్లాస్

- మహిళా సంఘాల్లో 41,465 మంది నిరక్షరాస్యుల గుర్తింపు
- రాయడం, చదవడం, లెక్కలు నేర్పించడమే లక్ష్యం
- 4,200 మంది వలంటీర్లచే అక్షరాస్యత కార్యక్రమం
- వచ్చే నెల రెండో వారం నుంచి అమలు
- పది, ఇంటర్ ఫెయిల్ అయిన వారికి ఉన్నత విద్య



మహిళా సంఘాల్లో నిరక్షరాస్యులను గుర్తించేందుకు చేపట్టిన సర్వే కోసం శిక్షణకు హాజరైన మహిళలు (ఫైల్)



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

స్వశక్తి సంఘాలకు చెందిన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 'ఉల్లాస్' (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) అనే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటి వరకు వయోజన విద్య కార్యక్రమాల ద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దే కార్యక్ర మాలు నిర్వహించినప్పటికీ, కేవలం సంతకాలు పెట్టే వరకే అక్షరాస్యులను చేశారు. ఇప్పుడు పూర్తి స్థాయిలో చదవడం, రాయడం వచ్చే విధంగా అక్షరాస్యత కార్యక్ర మాన్ని అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో గల సుమారు 10 వేల పైచిలుకు స్వశక్తి సంఘాల్లో గల మహిళా సభ్యుల అక్షరాస్యతపై సర్వే చేశారు. ఈ సర్వే నాలుగు మాసాలుగా జరిగింది. సంఘాల్లో ఇప్పటి వరకు చదవడం, రాయడం రాని మహిళలు 41,465 మంది ఉన్నట్లు గుర్తించారు. సర్వేలో ఎవరెవరు ఎంత వరకు చదువుకున్నారు. పదో తరగతి, ఇంటర్‌మీడియెట్ చదివి ఎంత మంది ఫెయిల్ అయ్యారనే విషయమై కూడా సర్వే చేశారు. పదో తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన వారిని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్)లో ప్రవేశాలు కల్పించి ఉత్తీర్ణులను చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామీణ పేదరిక నిర్మూలన పథకం (సెర్ప్) భాగస్వామ్యంతో అమలు చేయనున్నారు. నిరక్షరాస్యులకు ప్రాథమిక విద్యతో పాటు వారికి డిజిటల్ అక్షరాస్యత, కీలకమైన జీవన నైపుణ్యాలు, ఆర్థిక అక్షరాస్యత, వృత్తి, నైపుణ్యం, నిరం తర విద్య అందించే లక్ష్యంతో ఉల్లాస్ కార్యక్రమాన్ని తీర్చిదిద్దారు. అందరికీ చదువు.. అందరి బాధ్యత అనే నినాదంతో ముందుకు తీసుకెళ్తున్నట్లు అధికారులు తెలిపారు. నవ భారత్ సాక్షర కార్యక్రమం కింద ఈ కేంద్ర ప్రాయోజిత పథకాన్ని రూపొందించింది. ఉల్లాస్ కార్యక్ర మం కింద ఎంపిక చేసిన వారికి అవగాహనతో చదవడం, రాయడం అంకెలు గుర్తించడం, కనీస సామర్థ్యా లతో కూడిన లెక్కలు చేయడం వంటివి నేర్పుతారు. ఇందుకోసం ఉల్లాస్ పోర్టల్, మొబైల్ యాప్ రూపొందించారు. ఉల్లాస్ ద్వారా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాలలో అక్షరాస్యత కార్యక్రమాలు అమలు చేయనున్నారు.

మహిళా సంఘాల్లో నిరక్షరాస్యులు ఇలా...

మండలం	నిరక్షరాస్యులు
అంతర్గాం	2,017
ధర్మారం	4,813
ఎలిగేడు	2,642
జూలపల్లి	2,349
కమాన్‌పూర్	2,277
మంథని	3,818
ముత్తారం	2,617
ఓదెల	3,056
పాలకుర్తి	2,609
రామగిరి	2,317
రామగుండం	1,711
కాల్వశ్రీరాంపూర్	2,192
సుల్తానాబాద్	3,727
పెద్దపల్లి	5,311
మొత్తం	41,456

● పది మందికి ఒక వలంటీర్..

జిల్లాలోని స్వశక్తి మహిళా సంఘాల్లో 41,456 మంది మహిళలు నిరక్షరాస్యులుగా గుర్తించారు. వీరందరి పేర్లను ఉల్లాస్ యాప్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. వీరికి అక్షర జ్ఞానం నేర్పేందుకు వలంటీర్లను నియమిస్తున్నారు. సంఘాల్లో చదువుకున్న మహిళలను ఎంపిక చేసి వీరికి వలంటీర్ల బాధ్యతలు అప్పగిస్తున్నారు. 10 మంది మహిళలకు కలిపి ఒక వలంటీర్ చొప్పున 4,200 మందిని ఎంపిక చేశారు. ఈ వలంటీర్లు స్వచ్ఛం

(మిగతా 8వపేజీలో)

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వైద్యశాఖ డైరెక్టర్ ఆసుపత్రుల తనిఖీ



సుల్తానాబాద్ ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న డైరెక్టర్ రవీంద్రనాయక్

సుల్తానాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజలు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ బి. రవీంద్ర నాయక్ అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి పీహెచ్‌సీ, సుల్తానాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సోమవారం సందర్శించారు. గర్రెపల్లి పీహెచ్‌సీ వద్ద డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రసన్న కుమారి డైరెక్టర్‌కు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన పీహెచ్‌సీలోని వివిధ విభాగాలను పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాలలో సీజనల్ వ్యాధులు, వైద్య సిబ్బంది తీసుకుంటున్న నివారణ చర్యలను తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై డైరెక్టర్ పలు సలహాలు సూచనలు అందించారు. పీహెచ్‌సీ పరిధిలో అందుతున్న సేవలు, రికార్డులు పరిశీలించారు. మాట్లాడుతు థియరీ ఉంటే సరిపోదని, ప్రాక్టికల్‌గా అవగాహన పెంచుకోవాలన్నారు. సుల్తానాబాద్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి ఆస్పత్రిలోని వివిధ విభాగాలను వివరించారు. జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రాజమౌళి, డాక్టర్ వాణిశ్రీ, సుధాకర్ రెడ్డి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మీనాక్షి నటరాజన్ పాదయాత్ర ఇన్‌చార్జిగా మక్కాన్‌సింగ్

గోదావరిఖని, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వివరించేందుకు ఈనెల 31 నుంచి ఆగస్టు 6వరకు ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టనున్నారు. ఈ పాదయాత్రకు సమన్వయకర్తలుగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, కేతూరి వెంకటేష్, జూలూరి ధనలక్ష్మి, పులి అనీల్ కుమార్‌లు వ్యవహరించనున్నారు. పాదయాత్ర రంగారెడ్డి జిల్లాలో 31న ప్రారంభమైన ఆగస్టు 1వరకు మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం, ఆగస్టు 1 నుంచి 2వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో, 2 నుంచి 3 వరకు, ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్‌లో 4న, ఉమ్మడి కరీంనగర్ జిల్లా చొప్పదండిలో 5న, వరంగల్ జిల్లా వర్ధన్నపేట 6న నిర్వహించనున్నారు.

నేడు నాగుల పంచమి

సుల్తానాబాద్, జూలై 28(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసంలోని నాగుల పంచమిని ఒక పండుగలా భావిస్తారు. మంగళవారం సమీప ఆలయాలలో ఉన్న నాగ ప్రతిమలకు, పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేస్తారు. ఆవు పాలు, నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. నూలు దారాలను పుట్టకు చుట్టి కొంతభాగాన్ని చేతులకు కంకణంగా కట్టుకుంటారు. ఇలా చేయడం వలన సర్పదోషాలు తొలగిపోతాయని, సంతానం ప్రాప్తిస్తుందని భక్తుల విశ్వాసం. పుట్ట మన్ను సేకరిస్తారు. ఆలయాల్లో సుబ్రహ్మణ్యస్వామి, జంట నాగుల ప్రతిమలకు పూజలు చేస్తారు. మంగళవారం పంచమి రావడంతో కాలసర్ప దోషాల పరిహారాలకు ఎక్కువ ఫలితాలు పొందవచ్చని పండితులు చెబుతున్నారు.

ప్రజావాణి అర్జీలను సత్వరం పరిష్కరించాలి



దరఖాస్తులు తీసుకుంటున్న అదనపు కలెక్టర్ వేణు

పెద్దపల్లిటౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చే అర్జీలను సత్వ రమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. గోదావరి ఖని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన సామాజిక కార్యకర్త బి.వంశీకృష్ణ బెల్ట్‌షాపులపై తప్పుడు సమాచారం ఇచ్చారని, నిబంధనలకు విరుద్ధంగా రామగుండం కార్పొరేషన్, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలో వైన్ షాపులకు అనుబంధంగా పర్మిట్ రూములు ఏర్పాటు చేశారని, తప్పుడు సమాచారం ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేసుకోగా ఎక్సైజ్ అధి కారికి రాశారు. రామగుండం ఇందిరానగర్‌కు చెందిన కల్లూరు వెంకటి ఇద్దరు పిల్లలు పట్టించుకోవడం లేదని, న్యాయం చేయాలని దరఖాస్తు చేసుకోగా ఆర్డీవోకు రాశారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన బృందావన్ కాలనీ వాసులు నివాసాల సమీపంలో ఉన్న రైస్‌మిల్లుల నుంచి బూడిద, దుర్వాసన వెదజల్లే పొగను వ్యర్థ జలాలను విడుదల చేస్తున్నాయని, కాలనీలో నివసించే ప్రజలు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని దరఖాస్తు చేసుకోగా ఆర్డీవోకు రాశారు. అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్టపై చెత్త వేసిన వ్యాపారికి రూ.11 వేల జరిమానా

పెద్దపల్లిటౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) రోడ్లపై చెత్త వేస్తే జరిమానా తప్పదని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ హెచ్చరించారు. మినీ ట్యాంక్ బండ్ (ఎల్లమ్మ చెరువు)పై చెత్త వేసినందుకు పట్టణానికి చెందిన వ్యాపారికి 11 వేల రూపాయలు జరిమానా విధించారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలు, వ్యాపారులు రోడ్లపై, డ్రైనేజీ, ఎస్సారెస్పీ కాలువల వెంబడి, ఎల్లమ్మ చెరువులో చెత్త వేయవద్దని, రాత్రి వేళ చెత్త తీసుకవచ్చి రోడ్ల పైన వేస్తున్నారన్నారు. పట్టణ ప్రజలు, వ్యాపారస్తులు మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి చెత్తను అందించి స్వచ్ఛ పెద్దపల్లిగా తీర్చిదిద్దే క్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సీనియర్ అసిస్టెంట్ అనిల్ కుమార్, జూనియర్ అసిస్టెంట్లు రమాకాంత్, ప్రదీప్ పాల్గొన్నారు.

మానేరుపై బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలు

- మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, భూపాలపల్లితో రవాణా అనుసంధానం
- అడవిసోమన్‌పల్లి వద్ద ఒకటి, ఆరెంద-వెంకటాపూర్-స్వర్ణపల్లి వద్ద మరొకటి
- బ్రిడ్జిల నిర్మాణానికి ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు
- అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు

మంథని/మంథనిరూరల్, జూలై 28 (ఆంధ్ర జ్యోతి): పెద్దపల్లి-భూపాలపల్లి జిల్లాల సరిహద్దుగా ఉన్న మానేరు నది పై రెండు బ్రిడ్జిల నిర్మాణానికి కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం రెండు బ్రిడ్జిలు అందుబాటులో ఉండగా మరో రెండు నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు మానేరు నదిపై రెండు వంతెనలను నిర్మించడానికి ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదించారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, భూపాలపల్లికి రవాణా సౌకర్యం మరింత మెరుగుపడనుంది.

● బ్రిడ్జిల ప్రతిపాదనలు ఇలా...

భూపాలపల్లి జిల్లాతోపాటు కాళేశ్వరం మీదుగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు మరింత దగ్గర రవాణా సౌకర్యం కల్పించడానికి పార్టు-1లో మంథని మండలంలోని స్వర్ణపల్లి శివారులోని మానేరు నదిపై 1.08 కిలోమీటర్ల పొడవున ప్రతిపాదించారు. అలాగే పార్టు-2లో వెంకటాపూర్ శివారులో 950 మీటర్ల పొడవున, పార్టు-3లో ఆరెంద శివారులోని ఎస్సీ కాలనీ నుంచి 1.16 కిలోమీటర్ల పొడవున బ్రిడ్జి నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.



అడవిసోమన్‌పల్లి వద్ద మానేరుపై ఉన్న బ్రిడ్జి

ఆరెంద వద్ద తొలుత బ్రిడ్జి నిర్మాణానికి రూ.130 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు. మరింత అనువైన రవాణా కోసం స్వర్ణపల్లి, వెంకటాపూర్ శివారులోని మానేరు నదిపై బ్రిడ్జిల నిర్మాణాలను పరిశీలిస్తున్నారు. అడవిసోమన్‌పల్లి వద్ద ప్రస్తుతం ఉన్న వంతెన శిథిలావస్థకు చేరు కుం టుండంతో ముందస్తుగా ప్రస్తుతం ఉన్న ఎడమ వైపు మరో వంతెన నిర్మాణం కోసం ఇంజనీరింగ్ అధికారులు రూ. 118 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు తయారు చేశారు. ఈ రెండు బ్రిడ్జిల నిర్మాణం కోసం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఇంజ నీరింగ్ అధికారులతో సమీక్షలు నిర్వహించారు. మూ డు ప్రతిపాదనల్లో ఉన్న బ్రిడ్జి నిర్మాణం త్వర లోనే అనువుగా ఉన్న స్థలంలో నిర్మాణానికి ఫైనల్ కానుంది.

● ప్రస్తుత రవాణా సౌకర్యం

మంథని మండలంలోని అడవిసోమన్‌పల్లి వద్ద 1971లో మంథని నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న పీవీ నర్సింహారావు సీఎంగా పని చేసిన సమయంలో వంతెన నిర్మించారు. నాటి నుంచి ఉమ్మడి వరంగల్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు వెళ్ళటానికి ఈ వంతెన ఉపయోగపడింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు సింగరేణి పారిశ్రామిక ప్రాంతంగా ఎదిగిన భూపాలపల్లితో రవాణా వ్యవస్థను పెంచడానికి మల్హర్-ముత్తారం మండలాల సరిహద్దుగా ఉన్న ఖమ్మంపల్లి వద్ద మానేరు నది పై బ్రిడ్జి నిర్మించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట, హుజురాబాద్, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భూపాలపల్లి, పరకాల, హన్మకొండ, వరంగల్ ప్రాంతాలకు వెళ్ళడానికి అనువుగా ముత్తారం మండలంలోని ఓడేడ్ వద్ద మానేరు నదిపై బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రారంభించనప్పటికి పలు మార్లు వరద తాకిడి గుర్తై పిల్లర్లు కొట్టుకుపోయాయి. దీంతో ఇప్పటి వరకు ఆ బ్రిడ్జి నిర్మాణం అసంపూర్తిగానే మిగిలిపోయింది.

జలపాతాలకు సందర్శకుల తాకిడి



- పచ్చదనం అల్లుకున్న గట్టు సింగారం
- సబ్బితం జలపాతానికి చేరాలంటే పర్యాటకులకు ఇబ్బందులు
- అహ్లాదకరంగా పాండవ లొంక జలపాతం
- కనువిందు చేస్తున్న గాడుదులగండి గుట్ట

7

సీసీ రోడ్డు ఆక్రమించి గోడ నిర్మాణం



ముత్తారం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ముత్తారం మండలం మైదంబండ గ్రామంలో ఏకంగా ప్రధాన రహదారిని కబ్జా చేశాడు ఓ ఘనుడు. దీంతో ప్రయాణికులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి కబ్జా చేశాడని అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పుట్ట ఎర్ర ఓదెలు ఇంటిముందు ప్రభుత్వం నిర్మించిన సిమెంటు రోడ్డుపై ప్రహరీ నిర్మించాడు. అంతేకాకుండా విద్యుత్ స్తంభాన్ని, డ్రైనేజీ దాటి రోడ్డును ఆక్రమించాడు. విద్యుత్ స్తంభం పక్కనుంచి రహదారి ఉండగా అటు వైపు ప్రజలు వెళ్ళకుండా సీసీ రోడ్డును ఆక్రమించాడని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో రహదారిపై ఎదురెదురుగా వస్తున్న వాహనాలు వెళ్లాలంటే ఇబ్బందులు అవుతుందని గ్రామస్థులు తెలిపారు. ప్రధాన రహదారిని కబ్జా చేసిన ఓదెలుపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.

సమస్యలతో సతమతమవుతున్న గురుకుల పాఠశాలలు



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వీరయ్య

గోదావరిఖని, జూలై 28(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలు సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయని, ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వీరయ్య ఆరోపించారు. సోమవారం గోదావరిఖని శ్రామిక భవన్‌లో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ తరగతుల ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గురుకులాల దిశను మారుస్తామని చెప్పినప్పటికీ అమలు కావడం లేదని, విద్యార్థులు ఫుడ్‌పాయిజన్ జరిగి మృతి చెందడం, అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. హుజురాబాద్‌లోని గురుకుల పాఠశాలలో విద్యార్థులను ఎలుకలు కరవడంతో ఆసుపత్రి పాలయ్యారని, నాగర్ కర్నూల్‌లో ఫుడ్‌పాయిజన్‌తో అస్వస్థతకు గురయ్యారన్నారు. ఓబీసీలకు 42శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల్లో అమలు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపినప్పటికీ బిల్లు ఆమోదం చేయకుండా మోదీ అడ్డుపడుతున్నారని ఆరోపించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు జరిగే పరిస్థితి లేదని, స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబరులోపు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించినా ప్రక్రియ మొదలు కాలేదన్నారు. కేంద్ర మంత్రులైన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో పాటు 8మంది ఎంపీలను, బీజేపీ ఎమ్మెల్యేలు ఎలాంటి ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. బీసీలకు బీజేపీ ద్రోహం చేస్తుందని ఆరోపించారు. బిక్షపతి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించగా సీపీఎం నాయకులు యాకయ్య, మహేశ్వరి, ముత్యంరావు, రాజారెడ్డి, మెండె శ్రీనివాస్, గణేష్, కుమారస్వామి, రామాచారి, గణేష్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఉరి వేసుకొని ఒకరి బలవన్మరణం


చంద్రయ్య(ఫైల్)

గన్నేరువరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన పబ్బతి చంద్రయ్య (40) అప్పులబాధతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాలప్రకారం.. చంద్రయ్య ఉపాధి నిమిత్తం 5నెలల క్రితం సౌదీదేశానికి వెళ్లి ఇటీవలే స్వగ్రామానికి వచ్చాడు. అప్పటికే విదేశాలకు వెళ్లేందుకుచేసిన అప్పుతో పాటు తిరిగి వచ్చాక మరిన్ని అప్పులు చేశాడు. దీంతో సుమారు 4లక్షల వరకు అప్పు ఉండ దంతో అవితీర్చాలో తెలియక మనస్థాపం చెందాడు. దీంతో సోమవారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో ఇంటి ముందున్న జామచెట్టుకు ఉరివేసు కుని మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడు చంద్రయ్య భార్య పబ్బతి ప్రమీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అమెరికాలో సింగరేణి ఉద్యోగి మృతి


ప్రకాష్(ఫైల్)

గోదావరిఖని, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పవర్‌హౌస్‌కాలనీకి చెందిన పెరుక ప్రకాష్(53) అమెరికాలో శనివారం గుండె పోటుకు గురై చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఓసీపీ-2లో జనరల్ మజ్దూర్‌గా పని చేస్తున్న ప్రకాష్ రెండు నెలల క్రితం అమెరికా టెక్సాస్ స్టేట్ ఆస్టిన్‌లో కూతురు వద్దకు వెళ్లాడు. మరికొద్దిరోజుల్లో ఇండియాకు తిరిగివచ్చే సమయంలోనే శనివారంఉదయం ఆయన గుండెపోటుకు గురయ్యాడు. ఆసు పత్రిలో చికిత్స పొందుతూ ప్రకాష్ ఆదివారం మృతిచెందాడు. అతడి పార్థివదేహాన్ని గోదావరిఖనికి తీసుకువచ్చేందుకు బంధుమిత్రులు ప్రయత్నాలు చేస్తున్నారు.

నీటి బకెట్‌లో పడి బాలిక దుర్మరణం


మృతిచెందిన బాలిక

జూలపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన గుండు సతీష్ కూతురు సాన్వీ (19నెలలు) చిన్నారి ఇంటి ఆవరణలో ఉన్న బకెట్‌లో పడి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. గ్రామస్థులు పోలీసులు అందించిన సమాచారం మేరకు గుండు సతీష్, రవళి దంపతుల కూతురు సాన్వీ ఆదివారం రాత్రి ఇంటి ఆవరణలోఉన్న నీటి బకెట్‌లో ప్రమాదవశాత్తు పడి కొట్టుమిట్టాడుతుండగా గమనించిన తల్లి దండ్రులు, కుటుంబ సభ్యులు వైద్యంకోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రతిమ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తుండగానే మృతిచెందినట్లు తెలిపారు. చిన్నారి మృతిపై తమకు ఎవరిపై అనుమానం లేదని తండ్రి పోలీసులకు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సనత్‌కుమార్ తెలిపారు.

చిరుత దాడిలో లేగ దూడ మృతి

కోనరావుపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం ఎగ్లాస్‌పూర్ గ్రామంలో చిరుత దాడిలో లేగ దూడ మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వేముల మధు అనే రైతు తన పశువులను గ్రామ శివారులోని తన పొలం వద్ద కట్టేసి ఇంటికి వచ్చాడు. అదే రాత్రి చిరుత దాడిచేసి చంపివేసింది. ఈవిషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. చిరుత దాడిలోనే దూడ మృతి చెందినట్లు గుర్తించారు. చిరుత సంచారంతో పొలాల వద్దకు వెళ్లేందుకు అటవీప్రాంత రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం

ఎల్లారెడ్డిపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామశివారులో అనుమతి లేకుండా పేలుళ్లకు పాల్పడు తున్న వ్యక్తులపై సోమవారం దాడి చేశామని పోలీసులు తెలిపారు. కంప్రెసర్ వాహనంతోపాటు జిలెటిన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని వివరించారు.

సాహిత్య మహారాజు సినారె


- హన్మాజిపేట నుంచి..జ్ఞానపీఠం వరకు
- అక్షరానికి మాటల...పాటల చెలికాడు
- విశ్వంభరుడి జ్ఞాపకాల్లో సాహిత్య కారులు
- నేడు మహాకవి సి నారాయణరెడ్డి జయంతి


సిరిసిల్లలోని సినారె స్మారక గ్రంథాలయం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పాట.. మాట నా రెండు కళ్లు అన్నాడు.. మహాకవి డాక్టర్ సి. నారాయణరెడ్డి. మాటకు దండం పెడతా... పాటకూ దండంపెడతా... మాటను పాటను నమ్మిన మనిషికీ దండం పెడతా అంటూ సినారె అడుగులువేసిన మానేరు ఇసుక తిన్నెలు... మూలవాగు సవ్వడులు నేటికీ వినిపిస్తూనే ఉన్నాయి. జూలై 29 మహాకవి డాక్టర్ సి నారాయణరెడ్డి 94వ జయంతి సందర్భంగా ఆయన జ్ఞాపకాల మదిలోకి వెళ్తే...

సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం హన్మాజీపేట గ్రామంలో జులై 29, 1931లో సినారె ఊపిరి పోసుకున్నారు. తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కొడుకు సినారె. కుటుంబ పరంగా భూస్వామ్య వారసత్వమైన ఆ మనస్తత్వం ఇంట్లో ఎవరికీ లేదు. తండ్రి స్వయంగా తానే నాగలి పట్టి దున్నేవాడు. సినారె మూడో తరగతి వరకు ఊళ్లోనే చదువుకున్నా నాలుగో తరగతికి సిరిసిల్ల మానేరు ఒడ్డుకు చేరుకున్నారు. పొరుగూరికి పంపించి చదివించడం తల్లి బుచ్చమ్మకు ఇష్టం లేకపోయినా తండ్రి మల్లారెడ్డి ప్రోత్సాహంతో ఉన్నత చదువులు చదివారు.



'ఊపిరాడలేదు... ఉక్కపోస్తుంది. ఏసీ గదిలో... కారణం తెలిసి పోయింది. కవిత రాయలేదు ఇవాలా... రాస్తూ రాస్తూ పోతాను... సిర ఇంకిపోయే వరకు అంటూ సినారె తనకు 86 ఏళ్లు పూర్తవుతున్న సమయంలో 2017 జూన్ 12న కన్నుమూశారు.

సినారె సిరిసిల్ల మానేరు తీరాన ప్రాథమిక విద్యను కరీంనగర్‌లో ఉన్నత పాఠశాల విద్యను అభ్యసించి పైచదువులకు హైదరాబాద్‌కు చేరుకున్నారు. హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ కళాశాలలో ఇంటర్మీడియేట్, ఉస్మానియాలో బీఏ ఉర్దూ మీడియంలోనే పూర్తి చేశారు. ఉస్మానియా విశ్వవిద్యా లయం నుంచే తెలుగు సాహిత్యంలో పోస్టు గ్రాడ్యుయేట్, డాక్టరేట్ పొందారు. శ్రీ కృష్ణ దేవరాయ ఆంధ్ర భాషానిలయంలో అనేక గ్రంథాలను చదివారు.

తొలి రచన సిరిసిల్లలో ఆవిష్కరణ

బాల్యంనుంచే పద్యాలు, పాటలు, కవిత్వాన్ని రాసే సి. నారాయణరెడ్డి కళాశాల విద్యార్థిగానే శోభ పత్రికకు సంపాదకత్వం వహించారు. రోచిస్, సింహేంద్ర పేరుతో కవితలను రాసేవారు. సినారె కవిత తొలి సారిగా జనశక్తి పత్రికలో అచ్చయ్యింది. 1953లో నవ్వని పువ్వు సంగీత నృత్యనాటికను ప్రచురించారు. ఆది సిరిసిల్ల టౌన్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. అక్కడి నుంచి ఎన్నో కవితా సంపుటాలను వెలువరించారు.

ఎన్నెన్నో పురస్కారాలు

సినారె అందుకున్న అవార్డులు ఎన్నో ఉన్నాయి. 1974లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, రాజ్యలక్ష్మి అవార్డు, సోవియట్ ల్యాండ్ అవార్డు, మోహినిదాస్, కోమారన్, 1988లో అత్యున్నత జ్ఞానపీ ఠ అవార్డు అందుకున్నారు. పద్మశ్రీ, పద్మభూషణ్ పుర స్కారం, ఉత్తమ పాటల రచయితగా నంది పురస్కారం, గౌరవ డాక్టరేట్లను పొందారు. 95కిపైగా పుస్తకాలు రాయగా, సినిమాలకు 3,500లకుపైగా పాటలు రాశారు. హిందీ, ఉర్దూ భాషాల్లో కూడా కవితలు రాశారు.

అజేయుడు సినారె : జూకంటి జగన్నాథం,అధ్యక్షుడు, తెలంగాణ అఖిల భారత రచయితల సంఘం



సినారె అజేయుడు, చిరంజీవి. తెలుగు కవిత్వం ఉన్నంత వరకు సినారె అనే మూడు అక్షరాలు శిలాక్షరాలుగా నిలుస్తాయి. మారుమూల హనుమాజీపేట గ్రామంలో రైతు బిడ్డగా పుట్టిన సి నారా యణరెడ్డి దేశంలోని అత్యున్నత పురస్కారాలన్నీ పొందారు. సినిమా పాటలు రాసిన, యూనివర్సిటీలో పాఠాలు బోధించినా , రాజ్యసభలో తెలుగు భాషపై గలమెత్తిన నిండు నిఖార్సయిన తెలుగు రైతు కవిగా ప్రశ్నించేవారు.

తెలుగు సాహిత్యంలో ఒక ప్రవాహం వారాల ఆనంద్, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత



సినారె కవిత్వం తెలుగు సాహిత్యంలో ఒక ప్రవాహం. ఆయన కవిత్వం ప్రేమను, మానవతను, తాత్వికతను అక్షరాలలో నింపి ఒకవైపు సంగీతమయంగానూ, మరోవైపు లయాత్మకంగానూ ఉంటుం ది. తను విశ్వంభర వంటి దీర్ఘ కవితల్లో ప్రపంచాన్ని మానవ జీవితాన్ని తాత్వికంగా స్పృశించిన తత్వవేత్తగా కనిపిస్తారు. సినిమా పాటల్లో సులభతరమైన, అందరికీ చేరగలిగే భావాన్ని ఆయన పొందుపరిచారు.

పశువుల కాపరి పైకి దూసుకెళ్లిన కారు

- తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధానరహదారిపై కారు సోమవారం అదుపుతప్పి పశువుల కాపరిపైకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో మండలంలోని రాగట్లపల్లికి చెందిన కాపరి నవీన్ తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. నవీన్ తన పశువులను రోడ్డు పక్కన మేపుతున్నాడు. సిరిసిల్ల నుంచి ఎల్లారెడ్డిపేట వైపుకు వెళుతున్న కారు అదుపుతప్పి నవీన్‌పైకి దూసుకెళ్లింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

రూ.7600 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7600 పలికింది. సోమవారం మార్కెట్‌యార్డుకు ముగ్గురు రైతులు 15క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠ ధర రూ.7600 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

గంజాయి పట్టివేత

వెల్గటూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం ముక్కట్రావుపేట శివారులో వాహనాలు తనిఖీచేస్తుండగా ఓ యువకుడి వద్ద 110గ్రాముల గంజాయి దొరికినట్లు ఎస్సై ఆర్ ఉమాసాగర్ తెలిపారు. గంజాయితో పట్టుబడ్డ ఓ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ముక్కట్రావుపేట శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ యువకుడు అనుమానస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా గంజాయి దొరికినట్లు పేర్కొన్నారు. ఆ యువకుడిపై కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలు

- చీమలకుంటపల్లి, లలితాపూర్‌లలో దొంగల బీభత్సం
- బంగారం, వెండిని ఎత్తుకెళ్లిన దొంగలు

గన్నేరువరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలకుంటపల్లి గ్రామంలో దొంగలు తాళంవేసిన ఓ ఇంటిలో చొరబడి బీభత్సం సృష్టించారు. గ్రామానికి చెందిన ఎండీ రహీం భార్య అమీనాబేగం తన ఇంటికి తాళం వేసి రెండురోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లింది. ఈక్రమంలో దొంగలు ఇంటితాళం పగులగొట్టి 25తులాల వెండి, తులం బంగారం ఎత్తుకెళ్లి పోయారు. సోమవారం అమీనాబేగం తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంటితాళాలు, బీరువా పగుల గొట్టి ఉండడంతో దొంగతనం జరిగిందని గ్రహించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై నరేందర్‌రెడ్డి సిబ్బందితో చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. తాళంవేసిన ఇళ్లల్లోచోరీలు జరుగుతుండడంతో గ్రామస్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పోలీసులు ప్రత్యేకనిఘా ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

లలితాపూర్‌లో ..

మానకొండూర్: మండలంలోని లలితాపూర్ గ్రామంలో పొలవేణి రాజయ్య ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన రాజయ్య, అతని భార్య సుగుణ దంపతులు ఆదివారం ఇంటికి తాళంవేసి ఐనవోలు గ్రామంలో ఉండే వారి కూతురు ఇంటిలో పోచమ్మ పండుగకు వెళ్లారు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వారి ఇంటితాళాలు పగుల బీరువాలోని తులంన్నర బంగారు నగలు, 10తులాల వెండిని ఎత్తుకెళ్లారు. సోమవారం గ్రామానికి వచ్చిన దంపతులు ఇంటితలుపులు పగులకొట్టి ఉండడాన్ని గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని బంగారు నగలు లేకపోవడంతో లబోదిబోమంటూ విలపించారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు.


చీమలకుంటపల్లిలో దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై నరేందర్ రెడి

ఏడుగురిపై కేసు నమోదు

మెట్‌పల్లిటౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎవరికీ తెలియకుండా మెట్‌పల్లి క్లబ్ ఆస్తులను, భూములను విక్రయించారనే ఫిర్యాదు మేరకు ఏడుగురు వ్యక్తులపై కేసునమోదు చేసినట్లు మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. మెట్‌పల్లి పట్టణంలోని రామ్‌నగర్‌లో ఉన్న క్లబ్‌ను అక్రమంగా విక్రయించారని పట్టణానికి చెందిన దొంతుల వెంకటేశ్వర్‌రావు ఆదివారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చెట్లపల్లి నరేందర్‌గౌడ్, గంగుల వివేక్, వేముల కిషన్, దొంతుల సుధాకర్, వేము గంటి భూమేశ్వర్, నీల రాజు, వేముల అశోక్‌పై కేసు నమోదు చేసి దర్యాపు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

జాతీయ మానవ హక్కుల కమిషన్ బహిరంగ విచారణ

- ఒకే రోజు రెండు డివిజన్ బెంచీలపై 100కు పైగా కేసులు స్వీకరణ

హైదరాబాద్ సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): భూకబ్జాలు, ఆస్తి తగాదాలు, లైంగిక దాడులు తదితర మానవహక్కుల హననానికి సంబంధించిన వందకుపైగా కేసులపై జాతీయ మానవహక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) హైదరాబాద్‌లో సోమవారం బహిరంగ విచారణ నిర్వహించింది. డివిజన్ బెంచ్-1లో ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ జస్టిస్ రామ సుబ్రహ్మణ్యన్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్-1లో 36 కేసులు విచారించారు. కమిషన్ సభ్యులు సాయని విజయభారతి, జస్టిస్ బిద్యుత్‌రంజన్ సారంగి నేతృత్వంలోని డివిజన్ బెంచ్-2లో మొత్తం 52కేసులు విచారణకు వచ్చినట్లు సమాచారం. ఫుల్ బెంచ్ ఆధ్వర్యంలోనూ జైళ్లలోనిపరిస్థితులు, బాధితులకు తగిన సమయంలో పరిహారం అందకపోవడం, కొన్నికేసుల్లో పోలీసుల నిర్లక్ష్యం తదితర ఫిర్యాదులమీద సాయంత్రం వరకు విచారణ కొనసాగింది.

పాడి పరిశ్రమతో అదనపు ఆదాయం

- ఈ ఏడాది రూ.15కోట్ల బోనస్‌ను అందజేస్తాం
- ముల్కనూర్ సహకార బ్యాంకు అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి


మాట్లాడుతున్న బ్యాంకు అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

భీమదేవరపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమతో మహిళలు అదనపు ఆదాయం పొందాలని ముల్కనూర్ సహకార బ్యాంకు అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. సోమవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ మహిళా డెయిరీలో 23వ వార్షిక మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన బ్యాంకు అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం వచ్చిన లాభాల్లో రూ.15కోట్ల బోనస్ మహిళా రైతులకు సద్దుల బతుకమ్మ సందర్భంగా అందజేస్తామన్నారు. ప్రస్తుత రోజుల్లో వ్యవసాయం ఇబ్బందిగా మారిందన్నారు. దీంతో మహిళలు పాడి పరిశ్రమ వైపు దృష్టిసారించి అదనపు ఆదాయం పొందాలన్నారు.

అనంతరం ముల్కనూర్ డెయిరీ జీఎం మార్పాటి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజు డెయిరీకి 48వేల లీటర్ల ఆవు పాలు, 20వేల లీటర్ల గేదె పాలు వస్తున్నాయన్నారు. ఈ సంవత్సరం సభ్యులకు రూ. 1.05కోట్లు సంక్షేమ పథకాలకు నిధులు పెంపు చేశామన్నారు. అంతకుముందు వార్షిక నివేదికను ఆడిట్ మేనేజర్ అజయ్ సభ ముందు ఉంచారు. కార్యక్రమంలో డైరెక్టర్లు జంపాల రాజేశ్వరి, నల్లాల సులోచన, పింగిలి రజిత, దొంతరవేణ రజిత, మామిడాల శోభారాణి, కర్ర రమాదేవి, కత్తుల కవిత, పెద్దవేణ అరుణ, గుండేల్లి రజిత, పొన్నం సుజాత, గుగ్లోతు సుజాతలతో పాటు వివిధ గ్రామాలకు చెందిన అధ్యక్షులు పాల్గొన్నారు.

మూడు వాహనాలను ఢీకొట్టిన కారు

సిరిసిల్ల క్రైం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని లహరి గ్రాండ్ వద్ద ఆదివారం అర్ధరాత్రి ఓ కారు అదుపుతప్పి మూడువాహనాలకు ఢీకొట్టింది. ఈ సంఘటనలో వాహనాలలో ఎవరూ లేకపో వడంతో ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నుంచి సిరిసిల్లకు వైపునకు వస్తున్న కారు అతివేగంగా వెళ్తూ పార్కింగ్‌లో ఉన్న రెండు కార్లకు ఢీకొని ఎదురుగా ఉన్న ఓ ప్రైవేటు బస్సుకు ఢీకొంది. ఈ సంఘటనలో కారు నడుపుతున్న డ్రైవర్‌కు గాయాలు కాగా కారు నుజ్జునుజ్జయింది.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం నగునూర్ శివారు వాగునుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నట్లు రూరల్‌సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. ట్రాక్టర్‌డ్రైవర్ బి.మహేష్‌పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

పండ్ల తోటల్లో లౌడ్ స్పీకర్లు

- పక్షుల బెడదకు రైతుల పాట్లు
- చిన్న ఆలోచనతో చక్కని పరిష్కారం
- ఒక్కసారి చార్జింగ్ చేస్తే ఏడు గంటల వరకు శబ్దాలు


తాను ఏర్పాటు చేసిన లౌడ్ స్పీకరుతో రైతు రవీందర్‌రావు

గంగాధర, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పంటలను పక్షులు, జంతువుల బారి కాపాడుకునేందుకు ఓ రైతు వినూత్నంగా ఆలోచన చేశాడు. గంగాధర మండలం కొండన్నపల్లి శివారులో కరీంనగర్‌కు చెందిన రైతు రవీందర్‌రావు 5ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇక్కడసాగుకు నీరు తక్కువగా ఉండడంతో ఆయన 13రకాల పండ్లచెట్లను నాటాడు. ప్రస్తుతం ఆయనకు జామపళ్లు రోజుకు రెండు క్వింటాళ్లు దిగుబడి వస్తోంది. పక్షులు, జంతువులు పండ్లను తింటూ తీవ్రనష్టం చేస్తున్నాయి. కూలీలను పెట్టి పక్షులను తరిమేయాల్సి వస్తుండగా అదనపు భారం పడుతోంది. దీంతో ఆయన పక్షుల బెడద నివారణకు మైక్‌ను ఏర్పాటు చేశాడు. దానిలో పక్షులు, జంతువులు భయపడేలా వివిధ రకాల సౌండ్స్ రికార్డు చేయించాడు. తోట చుట్టూ మూడు మైక్‌లను పెట్టి సౌండ్ చేయిస్తున్నాడు. దీంతో ఆసౌండ్ విన్న పక్షులు భయంతో చెట్ల పైనుంచి ఎగిరిపోతున్నాయి. గంగాధర బ్లాక్‌లోని స్వామి అనే రైతు తనకున్న మామిడి తోటను కోతులు, పక్షుల నుంచి కాపాడుకోవడానికి ఏడు మైకులను ఏర్పాటు చేశాడు. గంగాధర, కొండన్నపల్లిలో రైతులు ఉపయోగిస్తున్న సౌండ్‌తో పక్షులు, కోతులు, ముంగీసలు, పిల్లులు పారిపోతుండగా మండలంలోని పలుగ్రామాల రైతులు పంట పొలాల్లో ఏర్పాటు చేసుకునేందుకు ఆలోచన చేస్తున్నారు.

పేకాటరాయుళ్లపై కేసు

ఎల్లారెడ్డిపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామశివారులోని గుడిసెలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడిచేశామని ఎస్ఐ మోతీరాం సోమవారం తెలిపారు. పేకాట ఆడుతున్న 8మంది వద్ద నుంచి 8 సెల్‌ఫోన్లు, 6ద్విచక్రవాహనాలు, పేకాట ముక్కలు, రూ.4630 నగదును స్వాధీన పర్చుకున్నామని పేర్కొన్నారు. పేకాటరాయుళ్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

శ్రీరాములపల్లెలో..

గొల్లపల్లి: మండలంలోని శ్రీరాములపల్లె గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేసి ఆరుగురు పేకాటరాయుళ్లను సోమవారం అరెస్ట్ చేశారు. ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి కథనం ప్రకారం పక్కా సమాచారం మేరకు గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించగా ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. వారి వద్ద రూ.7,380 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు వేదికగా కరీంనగర్

- జిల్లా ఒలింపిక్ సంఘు ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఉమ్మడిజిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి జనార్దన్ రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో రాష్ట్రస్థాయి క్రీడలకు కరీంనగర్ వేదికగా నిలుస్తోందని ఉమ్మడిజిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వాగ్దేవిడిగ్రీ, పీజీకళాశాలలో 3వ తెలంగాణ రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూకరాటే పోటీల బ్రోచర్‌ను కళాశాల చైర్మన్ గోవిందవరం కృష్ణ, పాఠశాల డైరెక్టర్ గోపు సుశాంక్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ పోటీలను సెప్టెంబరులో కరీంనగర్ జిల్లాకేంద్రంలో నిర్వహించనుండడం అభినందనీయమన్నారు. పోటీలనిర్వాహకుడు ఎలగందుల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి హాజరయ్యే క్రీడాకారులకు ఉచితభోజన, వసతి సౌకర్యాలు కల్పించనున్నామన్నారు. ఆల్‌స్టైల్ కుంగ్‌ఫూ యూనిట్ ఆఫ్ తెలంగాణ అధ్యక్ష, కార్యదర్శులు నేరెళ్ల శ్రీధర్‌గౌడ్, బొడ్డు రాజమల్లు, ఉపాధ్యక్షుడు రాజేందర్, సంయుక్త కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, మాస్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులు


పతకాలను సాధించిన చిన్నారులతో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఖేలో ఇండియా రాష్ట్ర స్థాయి పోటీలలో సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన క్రీడాకారులు వివిధ విభాగాలలో సత్తాచాటారు. హైదరాబాద్ ఎల్బీస్టేడియం బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో ఖేల్ ఇండియా సిటి ఉమెన్స్ లీగ్ రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలో రాజన్న సిరిసిల్ల జిల్లా స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ నుండి ఎనిమిది మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఫైట్ విభాగం లైట్ కాంటాక్ట్ జూనియర్ విభాగంలో గంగనవేణి ప్రవళిక, చిల్డ్రన్స్ పాయింట్ ఫైట్ విభాగంలో ఎల్లె ప్రణవి, గజ్జెల హిరణ్మయి, కెడేట్ పాయింట్ ఫైట్ విభాగంలో గజ్జెల శ్వేదిక, కర్నె యుతిక బంగారు పతకాలను సాధించారు. కిక్ బాక్సింగ్‌లో లక్ష్మి ప్రసన్న, ప్రణవి, హిరణ్మయి, శ్వేదిక రజిత పతకాలను సాధించారు. కంచర్ల శ్రీనిక లింగం శ్లోక, లక్ష్మిప్రసన్నలు కాంస్య పతకాలను సాధించారు. పతకాలను సాధించిన క్రీడాకారులను తెలంగాణ కిక్ బాక్సింగ్ అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి మహిపాల్ పతకాలు, ప్రశంసా పతకాలను అందించి అభినందించారు.

జిల్లా స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వొడ్నాల శ్రీనివాస్, కోచ్ యెనగందుల శ్రీనివాస్ మాట్లాడుతూ బంగారు పతకాలు సాధించిన చిన్నారులు కిక్ బాక్సింగ్ సౌత్ ఇండియా పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన ఖేలో ఇండియా సిటి వుషూ ఉమెన్స్ లీగ్ రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లాకు చెందిన కందుకూరి లహరి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. వుషూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు స్వర్గం రవితేజ, కార్యదర్శి బిళ్ళ అఖిలభవాని, కోచ్ జావిద్‌ఖాన్ లహరిని అభినందించారు.



పాండవ లంకలో జలపాతం

జలపాతాలకు సందర్శకుల తాకిడి

- పచ్చదనం అల్లుకున్న గట్టు సింగారం
- అహ్లాదకరంగా పాండవ లొంక జలపాతం
- కనువిందు చేస్తున్న గాడుదులగండి గుట్ట

పెద్దపల్లి రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సబ్బితం జలపాతానికి సందర్శకుల తాకిడి పెరిగింది. పూర్వకాలంలో ఏర్పడిన ఈ జలపాతం కొన్నేళ్ల వరకు గ్రామస్థులకు మాత్రమే తెలిసేది. 8 ఏళ్లుగా జలపాతం వద్దకు సందర్శకుల తాకిడి పెరిగింది. గట్టుసింగారం గుట్టపై సీతమ్మలోరి లొద్ది అనే ప్రాంతానికి శ్రీరాముడు వనవాసంలో భాగంగా వచ్చినట్లు పూర్వీకులు చెబుతున్నారు. ఆ సమయంలో జలపాతం వద్ద నీటిని సేవించాడని పేర్కొంటున్నారు. గట్టుసింగారం గుట్టపైన మామిడికుంట, మిడి చెరువు, చొక్కన్న కుంటలు ఉన్నాయి. వర్షాలతో నిండి బండరాళ్ల ద్వారా జలధారగా వస్తోంది. ఆ జలధారనే గౌరిగుండాల జలపాతంగా మారినట్లు ప్రచారంలో సాగుతోంది. పురాతన కాలంలో గుండం వద్ద గౌరీ మాత అనే దేవత కొలువై స్నానాలు ఆచరించడంతో గౌరి గుండాల జలపాతంగా పేరు వచ్చిందని పూర్వీకులు తెలుపుతున్నారు.



సబ్బితం జలపాతం

పెద్దపల్లి జిల్లా కేంద్రం నుంచి మంథని వెళ్ళే దారిలో సబ్బితం వరకు 10 కి.మీ. దూరం ఉంది. అక్కడి నుంచి 3 కి.మీ. దూరంలో జలపాతం ఉంటుంది. జలపాతం సమీపం వరకు ద్విచక్ర వాహనాలు వెళ్తాయి. సబ్బితం నుంచి గౌరి గుండాల జలపాతం వద్దకు చేరుకోవాలంటే సుమారు 3 కి.మీ. మట్టి రోడ్డు ఉంటుంది. వర్షాలు కురిస్తే రోడ్డంతా బురద మయంగా ఇబ్బందికరంగా ఉంటుంది. జలధార వానాకాలంలో మాత్రమే ఉండటంతో ప్రజలు అధిక సంఖ్యలో వస్తారు. జలపాతానికి కిలోమీటర్ దూరం నుంచే వాహనాలు నిలిపి కాలినడకగా వెళ్లాల్సిన ఉంటుంది.

జలపాతం వద్ద పురాతన విగ్రహాలు

జలపాతం వద్ద రాయిని తొలచి చిన్న గుడి ఉంది. ఇందులో శివలింగం ఉంటుంది. దాని పక్కనే ఓ బండరాయిపై నాగదేవత, ఇతర రూపాలు చెక్కి ఉన్నాయి. విగ్రహంలో శివలింగం, గణపతి, గోళ్లభామలు, గుట్టపై బయ్యన్న విగ్రహాలున్నాయి. గట్టుసింగారం, సబ్బితం గ్రామ ప్రజలు శ్రావణ మాసం లో జలపాతం వద్దకు వెళ్లి పూజలు నిర్వహిస్తారు.

జలపాతం వద్ద పోలీస్ పికెట్

జలపాతం వద్ద పెద్దపల్లి రూరల్ పోలీసులు పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. జలపాతానికి వచ్చేందుకు ఎవరికి అనుమతి లేదని భారీ గేడ్‌లు ఏర్పాటు చేశారు. అక్కడ జరిగిన సంఘటనలు, జలపాతం వద్ద మృతిచెందిన వారి ఫొటోలతో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతం వద్ద పలువురు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికులు తెలిపారు. ముఖ్యంగా యువకులు మద్యం సేవిస్తూ పర్యాటకులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు.

జలపాతానికి రూ. 6 కోట్లు నిధులు కేటాయింపు

సబ్బితం జలపాతం అభివృద్ధికి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు చొరవతో రూ. 6 కోట్ల నిధులు విడుదల చేశారు. జలపాతం వెళ్ళేందుకు రోడ్లు, జలపాతం వద్ద సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు.

జలపాతం సందర్శనకు అనుమతి లేదు
మల్లేష్, పెద్దపల్లి రూరల్ ఎస్ఐ



సబ్బితం జలపాతం వద్ద ఇప్పటివరకు సందర్శనకు వచ్చి ఆరుగురు యువకులు మృతిచెందారు. జలపాతం వద్దకు ఎవరికి అనుమతి లేదు. సందర్శకులు, పర్యాటకులు సహకరించాలి. అలాంటి సంఘటనలు జరగకుండా సందర్శనను నిలిపివేశాం.

200 ఏళ్లనాటి జలపాతం
నూనె రాజయ్య, సబ్బితం గ్రామస్థుడు



నిజాం కాలంలో నవాబ్‌లు జలపాతం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గట్టుసింగారం, సబ్బితం గ్రామ ప్రజలు యేటా నిర్వహించే ఉత్సవాలకు వెళ్తారు. అక్కడ ఉన్న దేవుళ్లకు మొక్కితే కోరిన కోర్కెలు నెరవేరుతాయి.

తునికాకు కోసం గుట్టకు వెళ్లేవాళ్లం
ఆకుల మల్లమ్మ, సబ్బితం గ్రామస్థురాలు



చిన్నప్పుడు తునికాకు కోసం గుట్టకు వెళ్లేవాళ్లం. జలపాతం నీటితో దాహం తీర్చుకునేవాళ్లం. గతంలో జలపాతం వద్ద పెద్ద జాతర కొనసాగేది. గుట్ట మీద పంట పొలాలు సాగు చేస్తే కూలీకి వెళ్లాం. ప్రస్తుతం మా తాతల భూమి అక్కడే ఉంది.

ప్రకృతి అందాల మధ్య పాండవ లొంక జలపాతం

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని జాఫర్‌ఖాన్ పేట శివారులో కొండపై ఉన్న పాండవ లొంక జలపాతం వద్ద సందర్శకుల తాకిడి పెరిగింది. రామగిరి కొండలపై పడ్డ వర్షపు నీరు ప్రవహించి పాండవలొంక నుంచి కిందికి జలపాతంగా వస్తున్నది. ఈ పాండవ లొంక ప్రాంతం వరకు సరైన దారి, సౌకర్యం లేకపోవడంతో జాఫర్‌ఖాన్‌పేట హనుమాన్ ఆలయం నుంచి సుమారు రెండు కిలోమీటర్ల మేర ఈ పాండవ లొంక ప్రాంతం ఉంటుంది. ఎత్తైన బండరాళ్లు ఉండటంతో ఈ ప్రాంతానికి నడిచి వెళ్ళాలి. వెన్నంపల్లి, జాఫర్‌ఖాన్‌పేట నుంచి ఈప్రాంతానికి రావడానికి వీలున్నా సరైన రహదారి లేక పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. పాండవ లొంక జలపాతాన్ని సందర్శించి, అక్కడ జలపాతంలో సేద తీరుతూ ప్రకృతిని ఆస్వాదిస్తుంటారు. దీనిని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని పర్యాటకులు కోరుతున్నారు. ఈ ప్రాంతం అడవులతో నిండి పచ్చని చెట్లతో పాండవులబొమ్మలు, అంజనేయస్వామి విగ్రహం, తదితర దేవతా మూర్తులు ఉన్నాయి. శ్రావణమాసంలో తీర్థాలకు, సహపంక్తి భోజనాలకు గ్రామస్థులు ఇక్కడికి వస్తారు. రామగిరి, ఓదెల, ముత్తారం తదితర మండలాలకు దగ్గరగా ఉన్న ప్రాంతం కావడంతో అధిక సంఖ్యలో ప్రజలు ఈ జలపాత సందర్శనకు వస్తారు.

గాడుదులగండి గుట్ట జలపాతం వద్ద సందడి

మంథనిరూరల్: మంథని మండలంలోని ఎక్లాస్‌పూర్ సమీపంలోని గాడుదులగండి గుట్ట జలపాతం వద్ద సోమవారం యువత సందడి చేసింది. వారం రోజులుగా కురుసిన వర్షాలకు గుట్టపై అటవీ ప్రాంతంలో నిలిచిన బండల మీదుగా కిందకు నీరు వస్తోంది. మంథని చుట్ట పక్కల యువతతోపాటు కొయ్యూరు, కాటారం, భూపాలపల్లి వెళ్లే ప్రయాణికులు జలపాతం వద్ద సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. జలపాతం వద్దకు వెళ్లడానికి సరైన దారి లేక ఇబ్బందులు పడ్డారు.



కిసాన్‌నగర్‌లో కార్డన్‌సెర్చ్
71 వాహనాలు స్వాధీనం



స్థానికులతో మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, జూలై 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆధ్వర్యంలో త్రీ టౌన్ పరిధిలోని కిసాన్‌నగర్‌లో సోమవారం ఉదయం పోలీసులు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. పలు అంశాలపై తనిఖీలు చేపట్టారు. పాత నేరస్థులు ఎవరైనా అద్దెకు ఇల్లు తీసుకొని నివసిస్తున్నారా? అనే కోణంలో ఆరాతీశారు. సరైన ధ్రువపత్రాలు లేని 71 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 64 ద్విచక్రవాహనాలు, ఐదు ఆటోలు, ఒక ట్రాలీ ఆటో, ఒక కారు ఉన్నాయి. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు జరుగుతున్న తీరును వివరించారు. సైబర్ నేరానికి గురైతే గంట లోపల టోల్‌ఫ్రీ నంబరు 1930కి ఫోన్ చేయాలని, సొమ్మును ఫ్రీజ్ చేసి తిరిగి పొందవచ్చని తెలిపారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై స్థానికులకు అవగాహన కల్పించారు.

అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు : సీపీ

చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం హెచ్చరించారు. కార్డన్ సెర్చ్ అనంతరం స్థానికులతో మాట్లాడారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించే వ్యక్తులపై సమాచారం అందించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై సమాచారం ఉంటే డయల్ 100కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్డన్‌సెర్చ్ ఆపరేషన్ ద్వారా కిసాన్‌నగర్‌లో శాంతి భద్రతలను పటిష్ఠం చేయడంతోపాటు ప్రజల్లో నేరాలపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఆపరేషన్‌లో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, సీఐలు బిల్ల కోటేశ్వర్, కె.సృజన్‌రెడ్డి, జాన్‌రెడ్డి, పి.శ్రీలత, ఎస్సైలు పాల్గొన్నారు.

సరస్వతీ పుత్రుడికి ఆర్థిక చేయూత...
ఎమ్మెల్యే కవ్వంపల్లి పిలుపుతో విరాళాల వెల్లువ

కరీంనగర్ అర్బన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం గంగిపల్లి గ్రామానికి చెందిన మార మహేశ్ జేఈఈ మెయిన్స్‌లో జాతీయ స్థాయిలో 453వ ర్యాంకు, ఎస్సీ విభాగంలో 17వ ర్యాంకు సాధించి, తిరుచిరాపల్లి నిట్‌లో సీటు పొందాడు. అతడి చదువుకు పేదరికం అడ్డుగా నిలిచింది. అతడి ఐదేళ్ల చదువుకు ఎనిమిది లక్షల రూపాయల ఫీజు, మరో 15 వేలు రిజిస్ట్రేషన్ కోసం అవసరం.. మహేశ్ తండ్రి వ్యవసాయ కూలీ. రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబం. లక్షల రూపాయలు వెచ్చించి మహేశ్‌ను చదివించలేని పరిస్థితి. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేక, రాజీ పడి వేరే కోర్సు చేయలేక మహేశ్ తల్లడిల్లాడు. ఈ విషయం కాంగ్రెస్ కార్యకర్తల ద్వారా మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు తెలిసింది. ఆయన మహేశ్ చదువుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మానకొండూర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఇతరులు 3.22 లక్షల రూపాయల విరాళాలు పోగుచేశారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో సోమవారం ఎల్ఎండీ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ విద్యార్థి మహేశ్‌కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివిన మహేశ్ నిట్‌లో జాతీయ ర్యాంకు సాధించడం గొప్ప విషయమన్నారు. చదువులో రాణించే మహేశ్‌లాంటి నిరుపేద విద్యార్థులను ఆర్థికంగా ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహేశ్‌కు ఆర్థిక సహాయం అందించాలని పిలుపు ఇవ్వగానే కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉన్నతాధికారులు ముందుకు రావడం సంతోషకరమన్నారు. మహేశ్‌కు విరాళాలు ఇచ్చిన వారందరిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమం అనంతరం మహేశ్‌ను వెంటబెట్టుకుని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్ వద్దకు తీసుకువెళ్లి పరిచయం చేశారు. అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ సదరు విద్యార్థికి వ్యక్తిగత సాయం అందించారు.



మహేశ్‌కు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు చెల్లించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్నభోజన కార్మికులకు రావాల్సిన పెండింగ్ వేతనాలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, సీఐటీయూ మధ్యాహ్న భోజనరంగం జిల్లా కార్యదర్శి గుర జాల శ్రీధర్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం సీఐటీయూ మధాహ్న భోజన రంగం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తరలివచ్చిన కార్మికులుతో ధర్నాచేసి కలెక్టరేట్ ఏవోరాంరెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. పెండింగ్‌లో ఉన్న ఐదునెలల వేతనాలను ఇప్పించాలని వేడుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం బిల్లుల నిర్వహణ ఈకుబేర్ నుంచి మినహాయించాలన్నారు. జిల్లావ్యాప్తంగా అవసరమైన గ్యాస్‌సిలిండర్‌లను ప్రతి పాఠశాలకు ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి కార్మికురాలికి రూ. 10వేల వేతనం అమలు చేయాలన్నారు. మధ్యాహ్నభోజన పథకం ప్రైవేటీకరణను నిలిపివేయాలన్నారు. నగదు బదిలీ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాల న్నారు. కార్యక్రమంలో మధ్యాహ్నభోజన కార్మికులు బలమణి, మ్యాకల కవిత, గడప సంధ్య, మెరుగు బాబాయ్, రెడ్డిమల్ల లక్ష్మీ, కర్మె సంధ్య పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి 'మహా' వరద
ప్రాజెక్టులోకి 75,648 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి సోమవారం వరద నీరు రావడం భారీగా పెరిగింది. డ్యామ్‌లోకి రాత్రి 12 గంటల వరకు 75,648 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడం, విష్ణుపురి నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. మహారాష్ట్ర ప్రాంతం నుంచి సుమారు 50 వేలు క్యూసెక్కుల పైచిలుకు నీరు డ్యామ్‌లోకి వచ్చి చేరుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈనెల 27వ తేదీ మధ్యాహ్నం నుంచి ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీల సామర్థ్యానికిగాను ప్రస్తుతం 31.366 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరాలకు కలిపి ప్రాజెక్టు నుం చి 638 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఒక్క రోజు వ్యవధిలోనే ప్రాజెక్టులోకి 9 టీఎంసీల నీరు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

సీజన్‌లో తొలిసారి 65 వేలకు పైగా క్యూసెక్కులు దాటి..

ప్రస్తుత సంవత్సరం వానాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావొస్తున్నా ఇప్పటి వరకు గరిష్ఠంగా 9వేల క్యూసెక్కుల లోపు ఇన్‌ఫ్లో మాత్రమే వచ్చింది. ప్రస్తుత సీజన్‌లో 65 వేలకు పైగా క్యూసెక్కులు దాటడం ఇదే తొలిసారి. వారం రోజుల పాటు ఇన్‌ఫ్లో ఇదేవిధంగా కొనసాగితే ప్రాజెక్టు నిండుకుండలా మారుతుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

వేములవాడలో శ్రావణ సందడి

రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు





వేములవాడలో భక్తుల రద్దీ, జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లోని సోమేశ్వరాలయంలో భక్తుల పూజలు

వేములవాడ కల్చరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం మొదటి సోమవారం సందర్భంగా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఉదయాన్నే భక్తులు ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మ దర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకోగా రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల తరబడి కోడెమొక్కు క్యూలైన్‌లో నిరీక్షించి మొక్కులు చెల్లించుకున్నారు. పరివారం దేవాతాలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు స్వామి వారి కల్యాణ పూజకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఇబ్బందులు తలేత్తకుం డా ఆలయ ఈవో రాధాబాయి ఆధ్వర్యంలో ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, శ్రావణ్, అశోక్ ఆధ్వర్యంలో సూపరిండెంట్‌లు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ క్యూలైన్‌లు ముందుకు సాగేలా చర్యలు చేపట్టారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర నిత్యాన్నదాన సత్రానికి నిజామాబాద్ పట్టణానికి చెందిన మమత- రాజేందర్ దంపతులు రూ. ఒక లక్ష విరాళం అందజేశారు. తమ కూతురు రష్మిక పేరుతో ఆలయ నిత్యాన్నదాన సత్రానికి చెక్కును ఆలయ ఏఈవో శ్రావణ్ కుమార్‌కు అందజేశారు.

ఘనంగా మహాలింగార్చన

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రావణ మాసం మొదటి సోమవారం సందర్భంగా ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5.30 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేపట్టారు. సా యంత్రం 6.05 గంటల నుంచి ఆలయ కల్యాణ మంటపంలో మహా లింగార్చన వేద మంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు.

ధర్మపురిలో ప్రత్యేక పూజలు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో సోమవారం శ్రావణ సందడి నెలకొంది. లక్ష్మీ నరసింహస్వామి, అనుబంధ శ్రీ రామలింగేశ్వర, క్షేత్ర సమీపంలో గల అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంక టాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు జక్కు రవీందర్ పాల్గొన్నారు.

సోమేశ్వరాలయంలో..

మల్లాపూర్: మండల కేంద్రంలోని సోమేశ్వరాలయంలోని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. శివలింగానికి పంచా మృతాలతో అభిషేకాలు చేసి శివుడికి బిల్వపత్రిని సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు.

కోటిలింగాలలో..

వెల్గటూర్: కోటిలింగాలలో భక్తులు పార్వతీ కోటేశ్వర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు నాగరాజుశర్మ, సంజీవ్ శర్మ, అన్వేష్ శర్మలు భక్తులచే పూజలు చేయించి ఆశీర్వచనాలు అందజేశారు.



కల్యాణ పూజకు హాజరైన భక్తులు

నేడు పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం ప్రారంభం
ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించనున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



తంగళ్లపల్లి, జులై 28 (ఆంధ్రజ్యోతి):సిరిసిల్లలో జాతీయ స్థాయి విద్యా సంస్థ పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం నూతన భవనాన్ని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆన్‌లైన్ ద్వారా మంగళవారం ప్రారంభించనున్నారు. ప్రస్తుత రవాణా శాఖ మంత్రి, అప్పటి ఎంపీ పొన్నం ప్రభాకర్ చొరవతో 2013 కేంద్రీయ విద్యాలయం కోసం కృషి చేయగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సిరిసిల్లలో 2015లో మంజూరైంది. అప్పటి నుంచి సిరిసిల్లలో ఇరుకు గదుల్లో కొనసాగుతుండగా తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులో కేంద్రీయ విద్యాలయం కోసం స్వంత భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని కేంద్ర విద్యాశాఖ మంత్రి మంగళవారం ఉదయం 9 గంటలకు ఆన్‌లైన్ ద్వారా ప్రారంభిస్తున్నారు. కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్. కేంద్ర స్వతంత్ర ఇన్‌చార్జి మంత్రి జయంత్ చౌదరి పాల్గొననున్నారు.

ప్లాస్టిక్ బ్యాగుల వాడకం తగ్గేనా?

హోటళ్లు, దుకాణాల్లో యథేచ్ఛగా వినియోగం



జమ్మికుంట రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ బ్యాగ్‌ల నిషేధం అమలు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఒకవైపు ప్రభుత్వ అధికారులు తరుచూ ప్లాస్టిక్ నిషేధం అమలుపై పర్యవేక్షిస్తున్నా పరిస్థితుల్లో ఏమాత్రం మార్పు రావడం లేదు. దుకాణదారుల వద్ద దొరికిన ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు జరిమానాలు సైతం విధించారు. ఈ క్రమంలోనే దుకాణదారులకి ప్లాస్టిక్ కవర్లు వాడవద్దని, పేపర్ బ్యాగ్‌లు, జ్యూట్ బ్యాగ్‌లు వాడాలని సూచించారు. ఇది ఎక్కడా ఆచరణలో సాధ్యం కావడం లేదు. గతంలో షాపుల ఎదుట పెట్టి అమ్మకాలు జరిపే దుకాణాదారులు ప్రస్తుతం చాటుమాటుగా కౌంటర్ల లోపల పెట్టి ఇస్తున్నారు. పర్యావరణానికి ప్రమాదకరంగా మారిన 40 మైక్రాన్ల ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను నిషేధించినా అమలుకు నోచుకోవడం లేదు.

ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను వాడొద్దు..

ప్లాస్టిక్ కవర్లలో వేడి ఆహారపదార్థాలను తీసుకెళ్లడం వల్ల ఆ కవర్లలో ఉండే భారలోహాలు కరిగి ఆహారంలో చేరి విషపూరితంగా మారుతాయి. ముఖ్యంగా టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు పార్శిళ్లు తీసుకెళ్లేవారికి వేడి వేడి ఆహార పదార్థాలను కవర్లలో ప్యాక్ చేసి ఇస్తుంటారు. ఇలాంటి ఆహార పదార్థాలతో తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ముఖ్యంగా వేడి సాంబారును, వేడి టీని కవర్లలో తీసుకెళ్లడం చేయకూడదు. కొన్ని సందర్భాల్లో కవర్లలో ఇంటికి తీసుకెళ్లిన ఆహార పదార్థాలు తిన్న తర్వాత ఆ కవర్లను చెత్త కుండిలో వేస్తుంటారు. వాటిని మూగజీవాలు వాటిని తిని మృత్యువాత పడుతున్నాయి.

పర్యావరణానికి తీవ్ర హాని..

వేల సంవత్సరాల వరకు మట్టిలో కలవని గుణం కారణంగా ఇవి భూమి పైపొరల్లో పేరుకుపోయి వర్షం పడినపుడు నీటిని భూమిలో ఇంకకుండా అడ్డుకుంటాయి. దీనివల్ల భూగర్భ జలశాతం కూడా తగ్గిపోతుందని పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు. కాలువల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల ముంపు ఏర్పడుతోంది. అంతేకాకుండా వీటిని కాల్చినపుడు విష వాయువులు పెద్దఎత్తున గాలిలోకి వెలువడుతున్నాయి. కాబట్టి వీలైనంత వరకు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను నిషేధించేందుకు అందరూ నడుం బిగించాల్సిన అవసరం ఉంది.

రైతులు ప్లాస్టిక్ స్టార్టర్ బాక్సులు వాడాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ డీఈ

కాల్వశ్రీరాంపూర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): రైతులు పొలాల వద్ద విద్యుత్ సరఫరా కోసం ప్లాస్టిక్ స్టార్టర్ బాక్సులు వాడాలని విద్యుత్ శాఖ ఆపరేషన్ డీఈ తిరుపతి తెలిపారు. మండలంలోని కూనారంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం రైతులతో పొలంబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ తడిసిన స్టార్టర్ డబ్బాలు ముట్టుకోవద్దని, ప్లాస్టిక్ డబ్బాలు వాడితే విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఉంటాయని వివరించారు. రైతులకు ఏమైనా విద్యుత్ సమస్యలు ఉంటే ఏఈ, లైన్‌మన్‌ను సంప్రదించాలని తెలిపారు. ఏఈ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల అందజేత

కాల్వశ్రీరాంపూర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తారుపల్లి ఉన్నత పాఠశాలలో 6వ తరగతి విద్యార్థులకు సోమవారం టై, బెల్టులను అందజేశారు. గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు ప్రశాంత్, స్రవంతి, హరీష్, చింటు రూ.20 వేల విలువైన టై, బెల్టులు విద్యార్థులకు అందించారు. పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయుడు శ్యాంసుందర్ రెడ్డి, మధు, ఉపా ధ్యాయ బృందం, సంపత్, శ్రీనివాస్, రమాదేవి, స్వరూప, నాగయ్య, సత్య ప్రకాష్ రావు, రాజమౌళి, స్వరూప, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఎల్ఈడీ లైట్ల అందజేత

కమాన్‌పూర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి గ్రామపంచాయతీ, పేరపల్లికి ఎల్ఈడీ వీధి లైట్లను 30 చొప్పున కార్యదర్శులకు సోమవారం అందజేశామని లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి తెలిపారు. వీటిని కాంట్రాక్టర్ గుమ్మడి అంజయ్య అందించిన ఆర్థిక సహాయంతో సమకూర్చినట్లు చెప్పారు. వచ్చే నెల 4న రొంపికుంట గ్రామపంచాయతీ వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, మచ్చగిరి రాము, సభ్యులు అనవేని లక్ష్మీరాజం, మాజీ సర్పంచ్ సిలారపు మల్లయ్య, గ్రామ కార్యదర్శులు అమీనా బేగం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

కమాన్‌పూర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గోకుల్ నగర్‌లోని ఉమ్మాళ్ల ఓదెలు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు సోమవారం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగు సత్యనారాయణ గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వారికి 25 కేజీల బియ్యం, ఆర్థిక సహాయం అందజేశారు. సయ్యద్ ఇక్బాల్, ముస్తాక్, యూసుఫ్ లల్లూ, మల్యాల మహేష్, నరిగే మల్లేష్, కోరే బీరయ్య, తూండ్ల రాజయ్య, ఉమ్మల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

సుల్తానాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గర్రెపల్లిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, క్లబ్ అధ్యక్షుడు జూపల్లి తిరుమల్‌రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భగా ఎంపీడీవో మాట్లాడుతూ పేదలకు ఈ శిబిరాలతో ప్రయోజనం కలు గుతుందన్నారు. క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. శిబిరంలో పలువురికి కంటి ఆపరేషన్ల కోసం రెఫర్ చేయగా వారిని రేకుర్తి ఆసుపత్రికి తరలించారు. క్లబ్ ప్రతినిధులు, మాజీ సర్పంచ్ పడాల అజయ్, వెంకటేశం, వల్స నీలయ్య, మాటేటి శ్రీనివాస్, చక్రధర్, ప్రవీణ్ కుమార్, జగన్, కన్న రమేష్ గౌడ్, సతీష్, జూలూరి అశోక్ వెంకటేశం, వెంకన్న, రాజయ్య, భూమేష్ సదానందం పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత




చెక్కు అందజేస్తున్న ఎస్సై ప్రవీణ్ కుమార్

ధర్మారం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ధర్మారం గాయత్రి బ్యాంక్‌లో ఖాతా కలిగి ఇటీవల ప్రమాదంలో మరణించగా లక్ష రూపాయల ప్రమాద బీమా చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. నల్గొండ జిల్లాకు చెందిన సూర వెంకటస్వామి బతుకుదెరువు నిమిత్తం నర్సింహులపల్లిలో ఉన్నాడు. ధర్మారం గాయత్రి బ్యాంక్‌లో సూర వెంకటస్వామి నిర్భయ సేవింగ్ ఖాతా ఉంది. బావిలో పూడిక తీస్తున్న క్రమంలో వెంకటస్వామి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. లక్ష రూపాయల ప్రమాద బీమా చెక్కును వెంకటస్వామి తండ్రి సూర సైదులుకు ఎస్సై ప్రవీణ్ కుమార్ సోమవారం అందించారు. గాయత్రి బ్యాంక్ మేనేజర్ ఎల్లాల లవకుమార్, జూనియర్ ఆఫీసర్ అనీల్ కుమార్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లి రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని షీటీం సభ్యురాలు స్నేహలత అన్నారు. సోమవారం కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలపై, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. స్నేహలత మాట్లాడుతూ మహిళల రక్షణకు రోజు బస్టాండ్, ప్రధాన చౌరస్తాలు, జనసమీకరణ ప్రాంతాలు, కళాశాలల వద్ద షీ టీం నిరంతరంగా ఉంటుందని, ఎవరైనా వేధింపులకు గురి చేస్తే 6303923700 నంబరుకు కాల్ చేయాలని అన్నారు. డబ్బుల విషయంలో అత్యాశకు పోయి ఆన్‌లైన్ మోసాలకు గురి కావద్దన్నారు. షీ టీం సభ్యులు మౌనిక, సురేష్, ప్రధానోపాధ్యాయిని మాధురి, విద్యా కమిటీ చైర్మన్ సబ్బు రాజకుమారి సతీష్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ మృతి : పలువురి సంతాపం



ఈద రాజమ్మ(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ ఈద రాజమ్మ అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందగా సోమవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు నివాళులర్పించారు. ఆమె భర్త మాజీ సర్పంచ్ సత్యనారాయణరెడ్డిని పరామర్శించారు. మాజీ ఎంపీపీలు గోపగోని సార య్య గౌడ్, నూనెటి సంపత్, మాజీ జడ్పీటీసీ తిరుపతిరెడ్డి, పార్టీల నాయకులు నివాళులర్పించారు.

రాజమ్మ నేత్రాలు దానం

సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈద రాజమ్మ నేత్రాలను సేకరించారు. ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి బీష్మాచారి ఆధ్వర్యంలో నేత్రాలను టెక్నీషియన్ ప్రదీప్ సేకరించి హైదరాబాద్‌లోని ఐ బ్యాంక్‌కు తరలించినట్లు తెలిపారు. ఈద సత్యనారాయణరెడ్డితో పాటు కుమారుడు రఘోత్తంరెడ్డి, కూతురు మాధవి అభినందనలు తెలిపారు. మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చదువు రామచంద్రారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ సబ్బని రాజమల్లు, మాజీ ఎంపీపీ బాలె మల్లీశ్వరి సమ్మయ్య పాల్గొన్నారు.

అతివల అక్షరాస్యతకు ఉల్లాస్

(5వ పేజీ తరువాయి)

దం గానే పని చేయాల్సి ఉంటుంది. వాలంటీర్ల పేర్లను కూడా యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఎంపిక చేసిన వారికి సామాజిక చైతన్య కేంద్రాలు (ఎస్ సీకే) అంటే ప్రభుత్వ, ప్రభుత్వేతర పాఠశాలలు, పంచాయతీ కార్యా లయాలు, కమ్యూనిటీ భవనాలు, ఉన్నత విద్యా సంస్థలు, ఉపాధ్యాయ శిక్షణా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్థానిక సంస్కృతి కేంద్రాలు, లైబ్రరీలలో క్లాసులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డీటీహెచ్, టీశాట్ ఛానల్ నంబరు 14లో క్రమం తప్పకుండా ప్రాంతీయ భాషల్లో వయోజన అభ్యాసకుల కోసం పాఠాలను ప్రసారం చేస్తారు. నిరక్షరాస్యులను అక్షరా స్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక పుస్తకాలు తయారు చేస్తున్నారు. ఉల్లాస్ కార్యక్రమం కింద స్వచ్ఛందంగా పనిచేసే చురుకైన విద్యార్థులకు క్రెడిట్‌లను ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు ఏఐసీటీఈ, ఎన్సీటీఈ అనుబంధ సంస్థలకు యూజీసీ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ఈ పథకాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు కార్పొరేట్ సంస్థలను భాగస్వాములుగా చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు కలె క్టర్ చైర్మన్‌గా జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేశారు. ఇందులో డీఈవో కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్, డీఆర్డీవో, డీఈవో, మెప్మా పీడీ, సెర్ప్, జిల్లా వైద్యారోగ్యశాఖ, శిశు సంక్షేమ శాఖ, జిల్లా పరిషత్ సీఈవోలు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు.

మొదలైన శిక్షణ కార్యక్రమాలు..

ఉల్లాస్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు శిక్షణ కార్యక్రమాలు ఆరంభమయ్యాయి. ఈనెల 28న రాష్ట్ర స్థాయిలో హైదరాబాద్‌లో జిల్లాకు చెందిన ముగ్గురు టీచర్లకు శిక్షణ ఇచ్చారు. వారు జిల్లా స్థాయిలో ఒక్కో మండలంలో ఇద్దరిని ఎంపిక చేసి 28 మందికి వచ్చే నెల 2న శిక్షణ ఇవ్వనున్నారు. మండల స్థాయిలో ఒక్కో గ్రామం నుంచి ఒక టీచర్, ఒక వీఓఏను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇస్తారు. శిక్షణ పొందిన టీచర్, వీఓఏలు గ్రామంలో ఎంపిక చేసిన వలంటీర్లకు శిక్షణ ఇవ్వనున్నారని వయోజన విద్య జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఆగస్టు రెండో వారంలో అక్షరాస్యత కార్యక్రమాన్ని అధికారికంగా ఆరంభించనున్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు నగదు అందజేత

పెద్దపల్లి రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024 - 25 విద్యాసంవత్సరంలో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు నిట్టూరు గ్రామానికి చెందిన వావిలాల రవిందర్‌రావు, వెంకట రమణరావులు నగదు ప్రోత్సాహకాలు అందించారు. కుంభాల నిత్యా మీన (584/600), పోతాని ఐశ్వర్య (575), జంజిరాల రూపప్రియ (562) మార్కులు సాధించగా ఒక్కొక్కరికి రూ. 10 వేల నగదు, అలాగే 500 పైగా మార్కులు వచ్చిన మరో 9 మంది విద్యార్థులకు రూ.1000 చొప్పున నగదు అందజేశారు. మండల విద్యాధికారి సురేంద్రకుమార్, ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య, ఉపాధ్యాయులు, సీఆర్‌పి సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల లీడర్‌గా ఎంపిక

కాల్వశ్రీరాంపూర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): మల్యాల గ్రామపరిధిలోని ఆదర్శ పాఠశాలలో ఈ నెల 26న విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించారు. ఇందులో పలువురు పాల్గొని పాఠశాల లీడర్‌ను ఎన్నుకున్నారు. ఈ మేరకు నిర్వహించిన పోటీలో సోమవారం బ్యాలెట్ బాక్స్‌ను తెరిచి ఓట్లను లెక్కించగా బంగారు అక్షయ్ విజయం సాధించి పాఠశాల లీడర్‌గా నిలిచారు. అక్షయ్‌ని ప్రిన్సిపాల్ అనుముల పోచయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీలను భర్తీ చేయాలి

పెద్దపల్లిటౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీలను భర్తీ చేయాలని ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాసీపేట ధర్మేందర్, ఆరు ముళ్ళ తిరుపతిలు కోరారు. వారు మాట్లాడుతూ ఆస్పత్రులలో వైద్య సౌకర్యాలను మెరుగుపరచాలని, మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడి పెరుగుతుందని, గ్రామాలలో ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని ప్రజలను నిలువునా దోపిడీ చేస్తున్నాయన్నారు. ప్రైవేటు దోపిడీని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండే లా చర్యలు తీసుకోవాలనీ. ప్రభుత్వ వైద్య వ్యవస్థను పటిష్ట పరచాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రగతిశీల యువజన సంఘం జిల్లా నాయకులు బొంతు ఆనంద్, బాలకృష్ణ, బాబు, నల్ల తీగల రమేష్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

ఆధునిక మెళకువలతో బోధన ప్రక్రియలో రాణించాలి



మాట్లాడుతున్న దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి కల్చరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): సామాజిక మార్పును పరిగణలోకి తీసుకొని ఆధునిక మెళకువలతో బోధనలో రాణించాలని విద్యా సంస్థల వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం పెద్దపల్లి ట్రినిటి డీఎడ్ కళాశాలలో జరిగిన ఓరియంటేషన్ ప్రోగ్రాంకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కళాశాలకు నిత్యం రావాలని, మీలో ఉన్న సృజనాత్మక ప్రక్రియలను నైపుణ్యాలను వెలికితీస్తూ వృత్తి నిబద్దతతో భావి ఉపాధ్యాయులుగా రాణించేలా ట్రినిటి కళాశాల తోడ్పాటునందిస్తుందని ఆయన తెలిపారు. ఇందులో విద్యార్థుల తల్లిదండ్రుల పాత్ర ఎంతో ఉంటుందన్నారు. వేగవంతమైన జీవితంలో సాంకేతిక అంశాలలో కూడా పరిజ్ఞానం అలవర్చుకోవాలన్నారు. విద్యార్థుల పరిచయ కార్యక్రమంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ట్రినిటి డిఎడ్, బీఎడ్ ప్రిన్సిపాళ్లు రెడ్డమ్మ, రజని, బుర్ర తిరుపతి, జైపాల్, హరితోపాటు అధ్యాపకులు దిలీప్ శర్మ, మధుకర్, తిరుపతి, రమేష్, అనురాధ, సుజాత, జ్యోతి, శారద పాల్గొన్నారు.

చెత్తను రీసైక్లింగ్ చేసి పర్యావరణాన్ని కాపాడాలి



బీఆర్‌సీసీ కేంద్రంలో పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్

కోల్‌సిటీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): చెత్తను రీసైక్లింగ్ చేసి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి అన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సోమవారం గౌతమినగర్‌లోని బీఆర్‌సీసీ కేంద్రం, కంపోస్టు యార్డు, వేస్ట్ ఆడిటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొడి, తడి చెత్త వేరువేరుగా సేకరించి రీసైక్లింగ్ ప్రక్రియ విజయవంతం చేయాలన్నారు. 7బీకాలనీ, విఠల్‌నగర్‌లో గార్బేర్ వల్నరబుల్ పాయింట్లను గుర్తించి శుభ్రం చేసి ముగ్గులు వేశారు. అక్కడ చెత్త వేయవద్దని కాలనీవాసులకు సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, మెప్మా సీఓ శ్వేత, శ్రీకాంత్, శానిటరీ జవాన్లు, స్వశక్తి మహిళలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల సమన్వయ సమావేశం



నర్సింహులపల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ధర్మారం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): దొంగతుర్తి, నర్సింహులపల్లి గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త లతో సమన్వయ సమావేశాలు నిర్వహించింది. గ్రామా లలో పార్టీ జెండా ఆవిష్కరించిన అనంతరం కార్యకర్త లతో సమావేశాలు నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని నిర్ణయించారు. బీఆర్ ఎస్ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూనే, కాంగ్రెస్ ప్రభుత్వంలో అమలు కాని హామీలను ప్రచారం చేయాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు రాచూరి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి కూరపాటి శ్రీనివాస్, మేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, గుర్రం మోహన్‌రెడ్డి, కాంపెల్లి చంద్రశేఖర్, పూస్కూరి రామరావు, ఆవుల శ్రీనివాస్, ఆవుల లత, కాంపెల్లి అపర్ణ తదితరలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



జయ్యారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన మనాలి ఠాకూర్

పాలకుర్తి, జూలై 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని మక్కాన్ సింగ్ సేవ సమితి చైర్‌పర్సన్ మనాలి ఠాకూర్ అన్నారు. సోమవారం జయ్యారం పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న డైనింగ్ హాల్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలువకుండా చూడాలని సూచించారు. వరినాట్లు వేస్తున్న మహిళ కూలీలతో కలిసి నాట్లు వేశారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. మాదాసు శ్రావణ్, గంగాధరి నవీన్ గౌడ్, జంగ సాగర్ తదిరతులున్నారు. బసంత్‌నగర్ బస్టాండ్ వద్ద కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మండల ముక్కెర శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్ స్వాగతం పలికారు.

విశ్వకర్మ ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు

యైటింక్లయిన్‌కాలనీ, జూలై28(ఆంధ్రజ్యోతి): కాలనీలోని విశ్వకర్మ ఆలయంలో మంగళవారం నుంచి ద్విపుష్కర ప్రయుక్త వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఆలయ నిర్మాణం జరిగి 24 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సహస్ర కలశ మహాకుంభాభిషేకం, విశ్వశాంతి మహాయజ్ఞం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కాలనీలో వనమహోత్సవం

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణ కాంగ్రెస్ నాయకులు తెలంగాణ చౌరస్తాలోని ఆటో స్టాండ్ ఆవరణలో మొక్కలు నాటారు. ప్రకృతిని కాపాడే బాధ్యత అందరిపై ఉన్నదని, ప్రతి పౌరుడు మొక్కలను నాటి సంరక్షించాలని నాయకులు పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు మారెల్లి రాజిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, నాయకులు శంకర్‌నాయక్, సాగంటి శంకర్, తిరుపతిరెడ్డి, చక్రపాణి, సారయ్యనాయక్, కిషన్‌నాయక్, పూజారి రాకేష్, అవినాష్, దేవయ్య పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ఈడీతో సీపెట్ అధికారి భేటీ

జ్యోతినగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : రామగుండం ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంతతో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్) ఉన్నతాధికారి ధర్మరాజు సోమవారం భేటీ అయ్యారు. ప్లాస్టిక్ ఉత్పత్తుల రంగంలో శిక్షణ, ఉపాధి కల్పన అంశాలపై చర్చించారు. సీపెట్ ప్లాస్టిక్ పరిశ్రమలో ఉపాధి కల్పించే లక్ష్యంతో నిరుద్యోగ యువతకు వివిధ విభాగాలలో ప్రత్యేక శిక్షణనిస్తున్నామని ధర్మరాజు తెలిపారు. ఎన్టీపీసీ ప్రభావిత ప్రాంతాల నిరుద్యోగులకు గతంలో ఎన్టీపీసీ అందించిన ఆర్థిక చేయూతతో శిక్షణనిచ్చి ఉపాధి చూపించామన్నారు. మషీన్ ఆపరేటర్స్, ప్లాస్టిక్ మౌల్డింగ్ తదితర విభాగాలలో ప్రభావిత ప్రాంతాల నిరుద్యోగులకు ఆర్థిక చేయూతతో శిక్షణనిస్తామని ధర్మరాజు తెలిపారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు 100 శాతం ప్లేస్‌మెంట్ కల్పిస్తామన్నారు. సీపెట్ చేస్తున్న సేవలపై ఎన్టీపీసీ ఈడీ చందన్‌కుమార్ అభినందనలు తెలిపారు. ఆసక్తి ఉన్న, అర్హులైన నిరుద్యోగులకు అవగాహన కల్పించి వారు సీపెట్‌లో శిక్షణ పొందేలా చూడాలని ఈడీ సూచించారు. అభ్యర్థులు సీపెట్ అధికారి ధర్మరాజును (9441247207) సంప్రదించాలని కోరారు.

సైన్స్ ల్యాబ్ ప్రారంభం

జ్యోతినగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం కాంపోజిట్ సైన్స్ ల్యాబ్‌ను ఎన్టీపీసీ ఈడీ చందన్‌కుమార్ సామంత ప్రారంభించారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు సైన్స్ ల్యాబొరేటరీని ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. పాఠశాల క్యాబినేట్‌ను నియమించారు. డీజీఎం(హెచ్‌ఆర్) ప్రవీణ్ కె చౌదరి, స్కూల్ ప్రిన్సిపాల్ ఉదయ్ కుమార్, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీ

జూలపల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి) : మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ నిర్వహించారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు నిర్వహించిన ఉపాధిహామీ పనుల ప్రగతి నివేదికలపై అధికారులు సామాజిక తనిఖీ ప్రజావేదికలో పలు గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.2721 జరిమానా విధించారు. గ్రామాల్లో జరిగిన పనులు, నిధుల వివరాలను అధికారులకు వివరించారు. ఏపిడి సత్యనారాయణ, ఎంపిడిఓ పద్మజ, ఎంపిఓ అనిల్‌రెడ్డి, ఏపిఓ సదానందం, కొమురయ్య, హరిక్రిష్ణ, దేవెందర్, కార్యదర్శులు, పాల్గొన్నారు.

ప్రపంచ ప్రకృతి దినోత్సవం

రామగిరి, జూలై 28(ఆంధ్రజ్యోతి): రామగిరిఖిల్లా సమీపంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ప్రకృతి దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పండ్ల, పూల మొక్కల విత్తనాలను ఏర్పాటు చేసిన రామగిరిఖిల్లా గుట్ట సమీపంలోని పరిసరాల్లో వెదజల్లారు. లయన్స్‌క్లబ్ డైరెక్టర్ శరణ్యమారుతీయాదవ్, మొలుమూరిశ్రీనివాస్, గంట వెంకటరమణరెడ్డి, తీగల శ్రీధర్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మంథని, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ టైమ్ న్యూరో కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో డాక్టర్ విక్రాంత్ సింగ్ ఆగస్టు 3న కరీంనగర్‌లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని మంథని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు సోమవారం కోరారు. నరాల సంబంధిత బలహీనలతో బాధపడేవారికి కోసం హెల్త్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్యాంపు వచ్చే వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడం తోపాటు డాక్టర్ విక్రాంత్ సింగ్ స్వయంగా సేవలందించి మందులు ఇస్తారన్నారు.

వృద్ధుడి దీనగాథపై అధికారుల విచారణ

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కాల్వశ్రీరాంపూర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్జంపేట గ్రామానికి చెందిన మూల రాజయ్యను కొడుకులు పట్టించుకోకపోవడంపై సోమవారం ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. సంక్షేమ శాఖ అధికారులు రాజయ్య ఇంటికి వెళ్లగా ఇంటికి తాళం వేసి ఉండటంతో చుట్టుపక్కల వారిని విచారించగా బంధువులు చనిపోతే వెళ్లారని తెలిపారు. రాజయ్య, ఆయన కుమారులు రాగానే కలెక్టర్ కార్యాలయానికి రావాలని తెలుపాలని సంక్షేమ శాఖ ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి స్వర్ణలత పేర్కొన్నారు.

ఆదర్శ పాఠశాలలో చేరికకు 3 వరకు గడువు

ఓదెల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఆదర్శ జూనియర్ కళాశాల, పాఠశాలలో విద్యార్థులు చేరికకు ఈనెల 30 నుంచి ఆగస్టు 3 వరకు చివరి తేదని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. అలాగే ఆగస్టులో మూడు వరకు కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం విద్యార్థులను ఇంటర్, ఆరు నుంచి పదో తరగతిలో మిగిలిపోయిన సీట్లల్లో భర్తీ చేస్తామని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు.

ఎరువుల దుకాణాలలో తనిఖీలు

ముత్తారం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ముత్తారం మండలంలోని ఎరువుల దుకాణాలలో తనిఖీలు నిర్వహించి స్టాక్ వివరాలు ఏవో అనూష పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో 135 టన్నుల యూరియా అందుబాటులో ఉందని, ఎరువుల డీలర్లు ఈపాస్ మిషన్ ద్వారా మాత్రమే విక్రయాలు చేయాలని సూచించారు. రైతులు ప్రస్తుతం అవసరం మేరకు యూరియాను కొనుగోలు చేయాలని, ఎక్కువ కొనుగోలు చేసి నిల్వ చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు.

ఇందిరమ్మ గృహాల పరిశీలన

రామగిరి, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రత్నాపూర్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ గృహలను జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణ అధికారి కాకర్ల నరేందర్ సోమవారం పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో శైలజారాణితో ఇందిరమ్మ గృహాలకు సంబంధించిన వివరాలపై చర్చించారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ఓటర్ లిస్ట్ మెర్జింగ్ వెంటనే పూర్తి చేయాలన్నారు. పిఏఐ ఆన్లైన్‌లో చేయవలసిన డేటా ఎంట్రీ పై పలు సూచనలు చేశారు.

నేషనల్ ఓపెన్ కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కోల్‌సిటీటౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లో ఈనెల 27న జరిగిన జాతీయస్థాయి ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో గోదావరిఖనికి చెందిన ఒకినావా రెడ్ డ్రాగన్ కరాటే ఇనిస్టిట్యూట్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనపర్చి పతకాలు సాధించారు. కటా, కుమితే విభాగంలో శాన్వి బంగారు పతకం, ఎస్.స్వరాష కాంస్య పతకం, టి.రిసిత కాంస్య, ఆర్.రాజా బంగారు, కాంస్య పతకాలు, ఎల్.మహాలక్ష్మి కాంస్య, ఎస్.అభన్ బంగారు, కాంస్య పతకాలు సాధించారు. జాతీయ గ్రాండ్ ఛాంపియన్ విజేతగా జి.శాన్వి నిలిచింది. విద్యార్థులను బ్లాక్‌బెల్ట్ కె.మొండయ్య, కోచ్ క్రాంతికుమార్, అమృత్‌సాయి అభినందించారు.

ఘనంగా ఆండాళ్ తిరునక్షత్ర వేడుకలు

సుల్తానాబాద్, జూలై 28: (ఆంధ్రజ్యోతి): వేణుగోపాల స్వామి ఆలయంలో ఆండాళ్ తిరునక్షత్ర వేడుకలు నిర్వహించారు. గోదాదేవికి అభిషేకాలతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. గోదా, కృష్ణ అష్టోత్తర నామాలు పారాయణం చేశారు. అనంతరం అమ్మ వారికి ఓడి బియ్యం, సారె కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు సౌమిత్ర శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. స్వప్న కాలనీలోని సాయిబాబా ఆలయంలో దత్తాత్రేయ పూజలు జరిగాయి.

బదిలీపై వెళుతున్న డిప్యూటీ తహసీల్దార్‌కు సన్మానం

ఎలిగేడు, జూలై 28(ఆంధ్రజ్యోతి):ఎలిగేడు డిప్యూటీ తహసీల్దార్‌గా సమర్థవంతంగా విధులు నిర్వర్తించి బదిలీపై మంథనికి వెళుతున్న బత్తిని కిరణ్ కుమార్‌ను తహసీల్దార్ సన్మానించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పలువురు అధికారులతో కలిసి తహసీల్దార్ యాకన్న సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు ధనలక్ష్మి, సరిత, ఆర్ఐలు జయలక్ష్మి, చంద్ర శేఖర్, ఆపరేటర్ స్వప్న, సిబ్బంది రాజు, అరుణ, సువర్ణ, రాజమ్మ, పోచం, లక్ష్మీనారాయణ, వీఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

రక్షణపై సమీక్షా సమావేశం



పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్న సంతోష్‌కుమార్

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియా ట్రైపార్టైడ్ రక్షణ సమావేశంపై సోమవారం జీఎం బండి వెంకటయ్య ఏరియా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏరియాలో తీసుకుంటున్న రక్షణ చర్యలను ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సంతోష్‌కుమార్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. రక్షణపై కార్మిక సంఘాల ప్రతినిధుల సూచనలు, సలహాలను అధికారులు తెలుసుకున్నారు. అన్ని గనులు, ఓసీపీకి సంబంధించిన వివరాలను పూర్తి స్థాయిలో సిద్ధం చేసుకోవాలని జీఎం అధికారు లకు సూచించారు. రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం మధుసూదన్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, అధికారుల సంఘం జనరల్ సెక్రెటరీ నర్సింహులు, వీకేపీ గని ఏజంట్ నెహ్రూ, అఫీషియేటింగ్ ఎస్వోటూ జీఎం సంతోష్‌కుమార్, పీఈ రాజాజీ, డీజీఎం (ఐఈ) మురళీకృష్ణ అన్ని గనులు, డిపార్ట్‌మెంట్‌ల అధికారులు, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



కాంట్రాక్టు కార్మికుల హక్కులు అమలు చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు చట్టబద్ధ హక్కులు, వసతులు అమలు చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ ఉపాధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం పోతనకాలనీ సివిక్ జోన్‌లో కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి యాజమాన్యం కార్మిక చట్టాలను అమలు చేయడం లేదని, 30వేల మంది కాంట్రాక్టు కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నట్టు పేర్కొన్నారు. నాలుగేళ్ళుగా సీఎంపీఎఫ్ చిట్టీలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. రాజేశం, నగేష్, ఓదేలు పాల్గొన్నారు.